



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


సంచిక : 256 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 06-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00



2 లో

## ప్రపంచ వరి సాగులో భారత్ రికార్డు

- వరి ధాన్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్..
- చైనాను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరిన భారత్
- రెండో స్థానానికి చైనా
- భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా.. చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితం



## మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

- మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఫైర్
- ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు..
- ప్రశంసిస్తూనే టారిఫ్‌లు పెంచుతానని హెచ్చరించిన ట్రంప్!

2 లో

# పోలవరం-నల్లమల'ను అడ్డుకుంటాం

### గోదావరి ట్రిబ్యూనల్ నిబంధనలను ఉల్లంఘించిన ఏపీ

- అనుమతులివ్వరాదని వివిధ కేంద్ర విభాగాలకు లేఖలు
- హరీశ్‌రావు లేఖను సీడబ్ల్యూసీ ఆమోదించలేదు
- ఈనెల 12న సుప్రీంకు స్వయంగా హాజరవుతా :
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ -జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటా మని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తేల్చిచెప్పారు. సోమవారం శాసనసభ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు ముమ్మాటికి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ)1980 అవార్డ్‌తో పాటు అంతరాష్ట్ర జల నిబంధనలను ఉల్లంఘించడ మేనని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ సీడబ్ల్యూసీ అంతర్గత సమాచారం కోసం పంపినది మాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణా రాష్ట్ర జల హక్కులపై ప్రజల్లో గందరగోళం సష్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని కొట్టి పారేశారు. పోలవరం-నల్లమల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఆర్ఎంబీ, పోలవరం ప్రాజెక్ట్ అధారిటీతో పాటు కేంద్ర జలసంఘం, పర్యావరణ, -మిగతా 2 లో



## బంగ్లాలో ఆగని హిందువుల హత్య

- మరో యువకుడిని కాల్చి చంపిన దుండగులు
- ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మృతి

**ఢాకా**

బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై హత్యాకాండలు ఆగడం లేదు. సోమవారం సాయంత్రం 5గ ప్రాంతంలో అందరూ చూస్తుండగానే మరో హిందూ యువకుడిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మృతిచెందగా, దుండగులు పరారయ్యారు. బంగ్లాదేశ్‌లోని జస్సోర్ జిల్లా కేశబ్పూర్ ఉపజిల్లా వార్డు నెంబర్-17లోని కొపలియా బజార్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మృతుని కేశబ్రూర్ ఉపజిల్లాలోని అరువా గ్రామానికి చెందిన రాణాప్రతాప్ (45)గా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, మార్కెట్‌కు వచ్చిన రాణాప్రతాప్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలిసిన మణిరాంపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం పంపామని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఆఫీసర్ ఇన్‌చార్జి రజివుల్లా ఖాన్ తెలిపారు. కొద్దికాలంగా దేశవ్యాప్తంగా పలు చోట్ల నిరసనలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తరహా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం గత మూడు వారాల్లో ఇది ఐదవది.



## నిలదీస్తామన్న వారు పారిపోయారు

- చర్చ పెడితే తోకముడిచారు
- బీఆర్ఎస్ గైర్హాజరుపై మండిపడ్డ భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్ -జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** :ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అసెంబ్లీ నుంచి జారుకున్నారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు సభ నుంచి తోకముడిచారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభాపతిని అవమానపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. -మిగతా 2 లో



## వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తా

**కింది నాయకులు దురాగతాలను పట్టించుకోని కెసిఆర్**

**ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో భావోద్వేగంతో కన్నీరు**

- బిఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు
- ప్రశ్నిస్తే..కారణం లేకుండా బయటకు పంపారు
- హరీష్ రావు అవినీతికి అంతు లేదు
- సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి
- కొత్త రాజకీయ వేదిక రాబోతోందంటూ పార్టీపై కవిత వెల్లడి

**హైదరాబాద్, -జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై కక్షతో బిజెపి నన్ను జైలులో పెట్టించిందని ఆరోపించారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగం అంటూ మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్ చేశారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కవిత శపథం చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్‌కు కవిత విజ్ఞప్తి చేశారు.

-మిగతా 2 లో




## బ్యాంక్ ఉద్యోగుల సమ్మె!..

- 27న దేశవ్యాప్తంగా విధుల బహిష్కరణ
- వారానికి 5 రోజుల పనిదినాలే ఉండాలని డిమాండ్

**న్యూఢిల్లీ, -**

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) కిందనున్న బ్యాంక్ ఉద్యోగ సంఘాలు ఈ నెల 27న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. వారానికి 5 పనిదినాలేనన్న డిమాండ్‌తో ఎంప్లాయిస్ ఈ స్ట్రైక్‌కు దిగుతున్నారు. దీంతో ఈ నెల ఆఖరి వారంలో వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతబడనున్నాయి. 24 (నాల్గో శనివారం), 25 (ఆదివారం), 26 (రిపబ్లిక్ డే) తేదీల్లో బ్యాంకులకు రెగ్యులర్ హాలిడేస్ ఉన్నాయి మరి. సమ్మె జరిగితే బ్యాంకులకు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని ఖాతాదారులకు ఇబ్బందేనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రస్తుతం ఆదివారాలు కాకుండా ప్రతి నెలా రెండో, నాల్గో శనివారాలు బ్యాంకులు మూతబడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నెలలో వచ్చే ఆ మిగతా 2 లేదా 3 శనివారాలు కూడా బ్యాంకులకు సెలవుగా ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. నిజానికి 2024 మార్చిలో జరిగిన వేతన సవరణ సెటిల్మెంట్ సందర్భంగా శనివారాలు బ్యాంకులకు సెలవు దినంగా అమలుపర్చేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), యూఎఫ్‌బీయూ రెండూ అంగీకరించాయి. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఈ ప్రతిపాదన కాస్తా మూలనపడింది. అయితే శనివారాల్లో బ్యాంకులను మూసేస్తే వచ్చే నష్టమేమీ లేదని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. మిగతా రోజుల్లో (సోమవారం నుంచి శుక్రవారం వరకు) అదనంగా -మిగతా 2 లో




## తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సరికాదు

- ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలి
- ఎన్టీఆర్ వచ్చాకనే ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు రాక
- కాళేశ్వరం కట్టినా తాము అడ్డుచెప్పలేదు
- వృథా జలాలనలు ఉపయోగిస్తేనే మేలు
- కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు నేనే పూర్తి చేశా
- ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు వెల్లడి

**గుంటూరు,-జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలని వ్యాఖ్యానించారు. దీనికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలంటే... మనలో ఐకమత్యంగా ఉండాలని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఉన్నా... తెలుగే మాతృభాష అని తెలిపారు. రెండు రాష్ట్రాలు కలిసి ఉంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సీఎం అయ్యాకే... సాగర్ జలాలను ఉపయోగించుకునేలా ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు తెచ్చారని ప్రస్తావించారు. సోమవారం గుంటూరు జిల్లాలో జరిగిన తెలుగు మహాసభ లో పాల్గొని ప్రసంగించారు సీఎం చంద్రబాబు. -మిగతా 2 లో

## ప్రధాని మోడీతో యోగి భేటీ

- యూపీ రాజకీయాలపైనే ఇరునేతల చర్చలు?



**న్యూఢిల్లీ -**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని ఆయన నివాసంలో సోమవారంనాడు కలుసుకున్నారు. ప్రధానంగా యూపి రాజకీయాలపైనే వీరిద్దరు చర్చించినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ మంత్రివర్గ విస్తరణ, 2027లో జరుగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో ఇరువురు చర్చించారు. ఉత్తరప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికలు, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలపై కూడా ఉభయ నేతలు చర్చించినట్టు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కూడా యోగి ఆదిత్యనాథ్ కలుసుకుంటారు. -మిగతా 2 లో

## ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం

**హైదరాబాద్ - జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** :ఐనవోలు మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలికారు. సిఎంను సోమవారం కలిసిన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఆహ్వానపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఐనవోలు పూజారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించారు.



# వ్యక్తిగా వెళుతున్నా..శక్తిగా తిరిగి వస్తా

మొదటి తరువాయి

సెప్టెంబర్ 3న ఛైర్మన్ ఫార్మాట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. సోమవారం నాడు తెలంగాణ శాసనమండలి సమావేశాలకు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆమె.. ఇదే తన చివరి ప్రసంగం అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్‌పై, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై, బీఆర్ఎస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఊహించని రీతిలో విరుచుకు పడ్డారు కవిత. తన కింద నాయకులు చేస్తోన్న దురాగతాలను కేసీఆర్ గమనించడం లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చటాన్ని తాను అంగీకరించ లేదన్నారు. తెలంగాణలో ఏం సాధించిందని.. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు వెళ్లిందంటూ తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బీజేపీ తనను జైలుకు పంపితే.. బీఆర్ఎస్ నాయకులు తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా మూడేళ్లు ఈడీతో తాను పోరాటం చేశానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడటం లేదంటూ కవిత సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకోలేని పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. హరీష్ రావు అవినీతి పరుడంటూ కవిత ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం పెద్ద జోక్ అని సెటైర్లు వేశారు. పార్టీ నడిపే పద్ధతి ఇది కాదని.. నైతికత లేని పార్టీ బీఆర్ఎస్ అంటూ శాసనమండలి సాక్షిగా దుమ్మెత్తిపోశారు. కనీసం సంజాయిషీ కూడా అడగకుండా తనను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 'నా ఇద్దరి కొడుకుల మీద ఒట్టు వేసి చెప్తోన్న.. బీఆర్ఎస్‌తో నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ' అని కవిత స్పష్టం చేశారు. 'ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నాపై కక్ష కట్టారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. పదవుల కోసం బీఆర్ఎస్ పార్టీలోకి పోలేదు. పార్టీలో.. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించాను.



సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. ఉద్యమకారులకు ఆర్థికసాయం చేద్దామంటే నా మాట వినలేదు. ఇసుక దందాల కోసమే నేరెళ్ల దురాగతం జరిగింది. తెలంగాణ వచ్చాక కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవటం అవమానకరం. సొంత సంస్థ జాగృతి ద్వారా తెలంగాణ ఉద్యమంలో పనిచేసి గుర్తింపు సంపాదించుకున్నాను. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారులు మాటలు కేసీఆర్‌కు చేరనివ్వటం లేదు. నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను అడుక్కోలేదు. ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కష్టపడ్డాను. తెలంగాణ జాగృతి సంస్థతో రాజకీయాల్లోకి వచ్చాను. బతుకమ్మ పండుగను ముందుకు తీసుకెళ్ళాను. నీళ్ళ విషంలో గత పాలకులు చేస్తోన్న తప్పునే.. ప్రస్తుత పాలకులు చేస్తున్నారు.' అంటూ సంచలన కామెంట్స్ చేశారు కవిత. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవితఅన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్థూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను'అని కవిత అన్నారు. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. 'ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా' అని కవిత వ్యాఖ్యానించారు.

# ప్రపంచ వరి సాగులో భారత్ రికార్డు

**వరి ధాన్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్..**
**చైనాను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరిన భారత్**
**రెండో స్థానానికి చైనా**
**భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా..**
**చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితం**

**న్యూఢిల్లీ,**



వరి ధాన్యం ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటిదాకా అగ్రస్థానంలో ఉన్న చైనా ను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద వరి ధాన్యం ఉత్పత్తిదారుగా అవతరించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా.. చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితమైందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి అభివృద్ధి చేసిన 25 రకాల పంటలకు చెందిన 184 కొత్త వంగడాలను ఆయన విడుదల చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధిలో భారత్ గొప్ప విజయం సాధించిందని చెప్పారు. ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు బియ్యాన్ని ఎగుమతి చేసే ప్రముఖ దేశంగా భారత్ మారిందని చౌహాన్ తెలిపారు. ఈ కొత్త వంగడాలను సాధ్యమైనంత త్వరగా రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు పప్పుధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. గడిచిన 11 ఏళ్లలో 3,236 అధిక దిగుబడినిచ్చే వంగడాలకు ఆమోదం తెలిపినట్లు మంత్రి గుర్తుచేశారు. వాతావరణ మార్పులు, కరువు, నేలల లవణీయత వంటి సవాళ్లను తట్టుకునేలా ఈ కొత్త వంగడాలను రూపొందించినట్లు వెల్లడించారు. ఒకప్పుడు ఆహార కొరత ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి చేరిందని చౌహాన్ హర్షం వ్యక్తంచేశారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విత్తన కంపెనీల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని కేంద్రమంత్రి చౌహాన్ తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సరికాదు

మొదటి తరువాయి

కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను తాను పూర్తి చేశానని స్పష్టం చేశారు. కృష్ణా డెల్టా మోడరైజేషన్ పేరుతో నీటిని పొదుపు చేసి... ఆ నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశామని వెల్లడించారు. గోదావరి నదిపై గుత్ప, అలీసాగర్, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టామని వివరించారు. ఆంధ్ర ప్రాంతంలో చాగల్‌నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తీసుకువచ్చామని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరిచ్చామని అన్నారు. విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ప్రత్యేక నిధులు ఇచ్చిందని వివరించారు, ప్రత్యేక చట్టం రూపొందించిందని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గతేడాది సుమారు కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. గోదావరి



నీళ్లను తెలంగాణ వాడుకున్నా తాను ఏనాడు అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంతరం చెప్పలేదని అన్నారు. ప్రతి ఏడాది గోదావరి నుంచి సముద్రంలోకి మూడువేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పుకొచ్చారు. కృష్ణా-గోదావరి నదులు అనుసంధానం జరుగుతుందని వెల్లడించారు. ఏపీలోని నదులన్నింటినీ అనుసంధానించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని అన్నారు. ఇది రాజకీయ వేదిక కాదు కాబట్టి... అన్ని మాట్లాడటం లేదని అన్నారు..ఐక్యత గురించే తాను మాట్లాడతానని చెప్పుకొచ్చారు. నీటి విషయంలోనైనా, సహకారం విషయంలోనైనా తెలుగువారంతా కలిసి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినప్పుడు తాను అడ్డుపడలేదని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు.. సమైక్యత అవసరమని చెప్పుకొచ్చారు. నీటి విషయంతో పాటు ఇతర అంశాల్లో తెలుగువారు కలిసే ఉండాలని సూచించారు. గంగా-కావేరి కలవాలని.. దేశంలో నీటి సమస్య పూర్తిగా తీరాలని.. అదే తన కోరిక అని చెప్పుకొచ్చారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం కావాలని అన్నారు. గోదావరి నీటిని తెలంగాణ వాడుకుంటే ఎప్పుడూ అడ్డుచెప్పలేదని వ్యాఖ్యానించారు. కృష్ణా డెల్టా అభివృద్ధి పేరుతో నీటిని తెలంగాణకు అందించామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తన హయాంలో.. తెలంగాణలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

- **మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఫైర్**
- **ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు..**
- **ప్రశంసిస్తూనే టారిఫ్‌లు పెంచుతానని హెచ్చరించిన ట్రంప్!**



**న్యూఢిల్లీ,**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీని ఒకవైపు ప్రశంసిస్తూనే మరోవైపు నుంచి చురకలు అంటించారు. మోదీ చాలా మంచి వ్యక్తి అని పొగుడ్తూనే.. తనకు నచ్చినట్లుగా చేయకపోతే సుంకాలు పెంచుతానని హెచ్చరించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో చేపట్టబోయే చర్యల గురించి చెబుతున్న వేళ ట్రంప్ భారత్ గురించి కూడా ప్రస్తావించారు. రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించిందని.. తనను సంతోషపెట్టేందుకే భారత ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. " వాళ్లు నన్ను సంతోషపెట్టాలని భావించారు. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. రష్యాతో వారు వ్యాపారం కొనసాగిస్తేం.. మనం చాలా వేగంగా టారిఫ్‌లు పెంచుతాం" అని ట్రంప్ హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఒక ఆడియా క్లిప్‌ను వైట్ హౌస్ ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ట్రంప్ మాట్లాడుతూ.. రష్యా ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిపారు. వెనెజువెలా ఆర్థిక వ్యవస్థ అయితే మరింత దయనీయంగా ఉందన్నారు. తాను చూసిన వాటిలో అత్యంత చెత్త ఆర్థిక వ్యవస్థ వెనెజువెలాదే అని పేర్కొన్నారు. కాగా, భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న వేళ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే గతంలోనూ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గిస్తామని ప్రధాని మోదీ తనతో చెప్పారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# బ్యాంక్ ఉద్యోగుల సమ్మె!..

మొదటి తరువాయి


40 నిమిషాలు ఎక్కువగా పనిచేసేందుకు ఉద్యోగులంతా సిద్ధమని ఓ ప్రకటనలో యూఎఫ్‌బీయూ చెప్తున్నది. ఇప్పటికే ఆర్బీఐ, ఎల్ఐసీ, జీఐసీ మొదలగునవి వారానికి 5 రోజులే పనిచేస్తున్నాయని గుర్తుచేస్తున్నది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్, మనీ మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజీల వంటి వాటికి కూడా శని, ఆదివారాల్లో సెలవేనని పేర్కొంటున్నది. ఇక చాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు సైతం శనివారాల్లో పనిచేయట్లేదని తెలిపింది. కాబట్టి వారానికి 5 రోజుల పనిదినాలను వద్దనేందుకు పెద్ద కారణమేమీ ఉండదని బ్యాంక్ ఉద్యోగ సంఘాలు అంటున్నాయి. కాగా, పేరిట ఉద్యోగ సంఘాలు చేపట్టిన సోషల్ మీడియా క్యాంపెయిన్‌కు 18,80, 027 లైక్‌లు వచ్చాయని, అలాగే సామాజిక మాధ్యమం 'ఎక్స్'పై దాదాపు 2,85,200 పోస్టులున్నాయాని యూఎఫ్‌బీయూ వెల్లడించింది.

# ప్రధాని మోడీతో యోగి భేటీ

మొదటి తరువాయి

ఉత్తరప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ జరుగునుందనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఉత్తరప్రదేశ్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా పంకజ్ చౌదరిని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో రాష్ట్ర మంత్రిమండలి విస్తరణ, సంస్థాగత మార్పులు అనేవి ప్రస్తుతం పార్టీ ఎజెండాలో ఉన్నాయి. జనవరి 14-15లో మకర సంక్రాతి పర్వదినం పూర్తి కాగానే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. దీంతో పాటు కమిషన్లు, బోర్డులు, కౌన్సిల్స్‌కు కూడా రాజకీయ నియామకాల పక్రియ త్వరలో చేపడతారు. ఇటీవల కాలంలో బీజేపీలో పలు ఆసక్తికర మార్పులు చోటుచేసుకున్నాయి. బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్‌ను ఇటీవల ఎన్నుకోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షుడిగా పంకజ్ చౌదరిని ఎన్నుకున్నారు. ఆ పదవికి పంకజ్ చౌదరి ఒక్కరే నామినేషన్ వేశారు. దీనికితోడు పలువురు బీజేపీ బ్రాహ్మణ ఎమ్మెల్యేలు లక్నోలో కొద్దిరోజుల క్రితం పీఎన్ పాథక్ నివాసంలో సమావేశం కావడం ఆసక్తికరమైంది. కమ్యూనిటీ ఫీస్ట్ (సహభోజ్) కోసం 40 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా, గత డిసెంబర్ 30న యోగి ఆదిత్యనాథ్ లక్నో నివాసంలో బీజేపీ కోర్ కమిటీ సమావేశమైంది. మంత్రివర్గంలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సమావేశంలో చర్చ జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన ఢిల్లీలోని పార్టీ అగ్రనాయకత్వంతో మాట్లాడారు. యూపీ ప్రభుత్వంలో ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిపి 54 మంది మంత్రులున్నారు. గరిష్టంగా 60 మందిని మంత్రివర్గంలో తీసుకోవచ్చు. 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే చివరి మంత్రివర్గ విస్తరణ కావచ్చని చెబుతున్నారు.

# పోలవరం-నల్లమల'ను అడ్డుకుంటాం



మొదటి తరువాయి

అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలకు లేఖలు రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయంతోపైన పేర్కొన్న సంస్థలన్నీ ఏకీభవించాయని పేర్కొన్నారు. డిసెంబర్ 4న కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖనే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా ప్రాంత ప్రయోజనాలను కాపాడేందుకు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్విని నియమించిందని తెలిపారు. సోమవారం జరగాల్సిన వాయిదాలు వచ్చే సోమవారానికి (జనవరి 12) వాయిదా పడ్డాయనీ, రిట్ పిటిషన్‌ను సూట్ పిటిషన్‌గా మార్చి దాఖలు చేయాలని కోర్టు సూచించినట్టు తెలిపారు. వచ్చే సోమవారం జరగనున్న వాదనలకు స్వయంగా తానే హాజరై మళ్ళీ స్టే ఆర్డర్ కోరతానని మంత్రి వివరించారు. ఈ విషయంపై రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా మరో సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు.రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలువరించ డంలో విజయం సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ పథకానికి బ్రేక్ పడిన విషయాన్ని తెలంగాణా సమాజం గుర్తుంచుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలకులు జల వనరుల నిర్వహణలో ఘోరంగా విఫలమయ్యారని మంత్రి మండిపడ్డారు. వారి పాలనలో మాటలకు చేతలకు ఎక్కడా పొంతన లేదని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి శ్రీశైలానికి, తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని రీ-డిజైన్ చేయడం వంటి నిర్ణయాలు తెలంగాణా భవిష్యత్ తరాల మీద మోయలేని భారాన్ని గత ప్రభుత్వం మోపిందని విమర్శించారు

# నిలదీస్తామన్న వారు పారిపోయారు

మొదటి తరువాయి

బీఏసీ సమావేశంలో యక్ష ప్రశ్నలు వేసిన ఆ పార్టీ నాయకులు.. ఇప్పుడు అసలు కనిపించట్లేదన్నారు. "శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ, బయట చెప్పడం సమంజసం కాదు'అని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఇకపోతే బీఏసీలో అన్ని అంశాలపై చర్చించాలని భారత రాష్ట్ర సమితి పట్టుబట్టిందని, వారి కోరిక మేరకు అన్ని అంశాలపై చర్చ పెడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, పాలమూరు - రంగారెడ్డిపై చర్చ పెడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ భయపడిపోయారని భట్టి విమర్శించారు. ఇబ్బంది అయిన రోజున వాకౌట్ చేశారంటే ఫర్వాలేదు కానీ.. మిగతా రోజులు ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై చర్చ బీఆర్ఎస్‌కు ముఖ్యం కాదా? అని ఎద్దేవా చేశారు. సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ పరిధిలోని అంశమని తెలిపారు. బీఏసీకి చెందిన ఏ నిర్ణయమైనా స్పీకర్ పరిధిలోనే ఉంటుందన్నారు. మండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనైంది నిజమేనని, ఆమె ఏం మాట్లాడారో రికార్డు అయ్యాయని తెలిపారు.

# ప్రజావాణి కి నాలుగు దరఖాస్తులు



**ఆమనగల్లు, జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లులో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కుసుమ మాధురి పేర్కొన్నారు. అందులో పెన్షన్ కి రెండు, ఇందిరమ్మ ఇల్లు, జీరో బిల్లు ఒకటి, రెవెన్యూ ఫిర్యాదులు ఒకటి వచ్చినట్లు వివరించారు. సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను ఆయా శాఖల అధికారుల కు పంపించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏఈ లు శరత్, శాలిని,అభిషేక్, తిరుపతయ్య, ఏపీఎం నీరజ, ఏపీవో మాధవరెడ్డి పాల్గొన్నారు.

# నర్సాపూర్ పాఠశాలలో నూతన తరగతి గది ప్రారంభం



**ఎలిగేడు, జనవరి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండలంలోని నర్సాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ గారిచే మంజూరు చేయబడిన కొత్త తరగతి గది సోమవారం గ్రామ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్ చేతులమీదుగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, తరగతి గది ప్రారంభించడం ఆనందకరమని, దీనిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మరింత కృషితో చదువుకోవాలని ఆకాంక్షంచారు. పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేంద్ర చారి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ విమల, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొని విద్యార్థుల భవిష్యత్తు కోసం కొత్త తరగతి గది ప్రారంభాన్ని సంతోషంగా స్వాగతించారు.

# లాలపల్లె, నారాయణపల్లిలో నట్టల మందు పంపిణీ



**ఎలిగేడు, జనవరి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండలంలోని లాలపల్లె, నారాయణపల్లి గ్రామాల్లో సోమవారం గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పశువైద్యురాలు ఝాన్సీ మాట్లాడుతూ, లాలపల్లెలో 550 జీవాలకు, నారాయణపల్లిలో 120 జీవాలకు మందు అందజేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పశుసంవర్ధకానికి, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సంతోషంగా స్వాగతించారు. నట్టల నివారణ మందు పంపిణీ ద్వారా గొర్రెల ఆరోగ్యం కాపాడబడుతుందని, పశువుల ఉత్పాదకత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపల్లి సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్, లాలపల్లి సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి, నారాయణపల్లి ఉప సర్పంచ్ కొత్తిరెడ్డి బాపురెడ్డి, మాజీ సర్పంచ్ మాడ కొండల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచులు గుడుగుల మహేందర్, సబ్బు శ్రీధర్, వార్డు సభ్యులు దూడం వీరేశం, ఓదెలు, కార్యదర్శి పాపయ్య, యాదవ సంఘం నాయకులు నక్క మల్లయ్య, రాజయ్య, పెద్ది రాజేశ్వర్, గోపాలమిత్ర సమ్మయ్య, అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# టి పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గా కానం గణేష్ గౌడ్



**ఆమనగల్లు, జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కాంగ్రెస్ పార్టీ న్యాయ,మానవ హక్కుల,సమాచార హక్కు లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గా చల్లంపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది కానం గణేష్ గౌడ్ ను నియమిస్తూ పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు.

ఈ సందర్భంగా గణేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పాలమూరు యూనివర్శిటీ ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడిగా 2012-2014 కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేసి సేవలను గుర్తించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయవాద వృత్తిలో పట్టా పొందిన తనను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా తన నియమాకానికి సహకరించిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్ల వంశీచంద్ రెడ్డికి

ఎంపి మల్లురవి కి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

**అభినందించిన వంశీచంద్ రెడ్డి**

కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గా నియమితులైన కానం గణేష్ గౌడ్ సోమవారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా గణేష్ గౌడ్ ను శాలువా కప్పి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,డిసిసి ,కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా , డీసీ సీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్యా నాయక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచి నాయిని నరేందర్, చల్లా అమర్ నాథ్ రెడ్డి,సీనియర్ నాయకుడు కాయితీ ప్రవీణ్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ అశోక్,డిప్యూటీ సర్పంచి కిరణ్ గౌడ్, గ్రామ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి, నాయకులు రమేష్ గౌడ్, కిసాన్ సెల్ నారాయణ రెడ్డి జంగయ్య గౌడ్, బాలగౌడ్ పాల్గొన్నారు.

# మహేశ్వరం డిసిపి పరిధిలో ఆమనగల్ ఏసిపి కార్యాలయాన్ని కలపాలి

**మాడుగుల, జనవరి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలంలో బిజెపి నాయకులు తహసిల్దార్ వినయ్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి1 రేవంత్ రెడ్డి పరిపాలన సౌలభ్యం కోసం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్ మండల కేంద్రంలో ఏసిపి కార్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సౌకర్యార్థం మాడుగుల మండలాన్ని ఆమనగల్ ఏసిపి కార్యాలయానికి అనుసంధానం చేస్తున్న సందర్భంలో, ఈ మండలాన్ని షాద్‌నగర్ డిసిపి పరిధిలో చేర్చితే ప్రజలకు దాదాపు వంద కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, రవాణా సదుపాయాల లోపం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం




ఉందని నాయకులు వివరించారు. సమయం వృథ కాకుండా, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆమనగల్ ఏసిపి కార్యాలయాన్ని మహేశ్వరం డిసిపి పరిధిలో చేర్చాలని ముఖ్యమంత్రి మరియు ఉన్నతాధికారులు ఆలోచించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు నల్లకాసుల పెద్దయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మరియు అసెంబ్లీ సోషల్ మీడియా కన్వినర్ మెట్టు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు రెడ్డేమోని జంగయ్య యాదవ్, ఏదుల వెంకటయ్య, మండల బిజెపి ఉపాధ్యక్షులు కడారి జంగయ్య యాదవ్, కార్యదర్శి మాదాసు వెంకటయ్య, దామర్ల అశోక్, దోడ్లపహాడ్ మాజీ సర్పంచ్ గజ్జ నిరంజన్, ఇర్వింటి భూపేష్ చారి, వార్డ్ మెంబర్ ఎమ్మే శివలీల శేఖర్, ఎమ్మే కృష్ణ, కాగల విష్ణు యాదవ్, కే కృష్ణ, సోషల్ మీడియా కన్వినర్ ఇర్వింటి శివచారి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి



సర్పంచ్, ఉప సర్పంచ్ కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్

**ఎలిగేడు, జనవరి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండలంలోని నారాయణపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్ సోమవారం జరిగిన గ్రామసభలో సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ బాపురెడ్డి మరియు నూతన పాలకవర్గానికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ఆయన పేర్కొంటూ, దశాబ్దం క్రితం గ్రామంలో సొంత భవనంలో పాఠశాల నడుస్తుండగా కొన్ని కారణాల వల్ల పాఠశాలను మూసివేసి సామాగ్రిని ఎలిగేడుకు తరలించారని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని 20262027 విద్యా సంవత్సరంలో పాఠశాలను పున‘ప్రారంభం చేసేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. గ్రామంలోని పిల్లలు తమ ఊరిలోనే చదువుకునే అవకాశం కల్పించేందుకు తాము ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని గుడుగుల మహేందర్ స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు కూడా ఈ వినతిని సమర్థిస్తూ, ప్రభుత్వ పాఠశాల పునరుద్ధరణ ద్వారా విద్యార్థుల భవిష్యత్తు వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

# రంగా రెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



**ఫరూక్ నగర్, జనవరి 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండలంలోని వెలజర్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు గందే సురేష్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 25,000




నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా వెలజర్ల గ్రామంలో ఈరోజు పంపిణీ జరగడం సంతోషకరమని తెలిపారు. విద్యార్థులు గురువులు చెప్పే విద్యను క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షంచారు. నోట్‌బుక్స్ పంపిణీకి ఆర్థిక సహకారం అందించిన షాద్‌నగర్ గురుకృప హెచ్పీ ఏజెన్సీ ప్రొప్రైటర్ ఇల్లూరి శ్రీనివాస్, బాబు, వారి సతీమణి ఇల్లూరి రూపదేవి మాట్లాడుతూ, జన్మదిన సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా మాజీ అధ్యక్షురాలు ఇల్లూరి రూపదేవి కూడా ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫరూక్నగర్ మండల మాజీ అధ్యక్షులు అనుమారి మురళీధర్, సామాజిక కార్యకర్త నీల రవీందర్, వాసవి క్లబ్ జోన్ పర్సన్ కొండా రమాదేవి, షాద్‌నగర్ మహిళా సంఘ సభ్యురాలు అరుణ, పాఠశాల హెడ్‌మాస్టర్ ఇమ్మానియేల్, రిటైర్డ్ టీచర్ శ్యామల, ఉపాధ్యాయులు వెంకటేశం, శివాజీ, ఉపాధ్యాయురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# శబరికి తరలిన స్వాములు



**ఆమనగల్లు, జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కార్తీక మాసం ఆరంభం కాగానే అంతటా శరణు ఘోష మారు మోగుతుంది.మకర జ్యోతి దర్శనం దీక్షను పాటిస్తారు.41 రోజులు ఉదయం,సాయంత్రం అయ్యప్ప స్వామికి నిత్యం పూజలు,అభిషేకాలు చేపడుతారు.అమనగల్లు లో 41 రోజులు దీక్షను చెప్పట్టిన స్వాములు సోమవారం ఆమనగల్లు పట్టణంలోఅయ్యప్ప దేవాలయం లో పూజలు చేసి, ఇరుముడి కార్యక్రమం చేపట్టి,గురు స్వామి అప్పి,వంశీ,కండె సాయి,అరుణ్,యాదగిరి,రాఘవేందర్ శబారికి బయలు దేరి వెళ్లారు.

# సమ్మక్క సారలమ్మ జాతర అధ్యక్షునిగా సాగర్



**ఎలిగేడు, జనవరి 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈనెల 28 నుండి 31 వరకు లాలపల్లె ఎలిగేడు పెండ్లిపోరు గుట్ట పై జరిగే సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ తాటికొండ సాగర్ ఉపాధ్యక్షుడిగా అడ్డగుంట రవీందర్ గౌడ్ కోశాధికారి గా అమ్ముల కుమారస్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల కుల సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టర్ నారాయణ రెడ్డి కి వినతి పత్రం



**ఆమనగల్లు, జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని సాకిబండ తండా రైతులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎకరానికి కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఫ్యూచర్ సిటీలో 500 గజాల స్థలం ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ స్పష్టమైన హామీ ఇచ్చిన సర్వే చేయడానికి ఒప్పుకుంటామని రైతులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పత్యా నాయక్,రవి రాథోడ్, బాలు నాయక్, మణిపాల్ నాయక్, శంకర్, పాండు, ఇంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, విజేందర్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచులు



**పాలకుర్తి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల నూతనంగా ఎన్నికైన పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, బసంతనగర్ సర్పంచ్ పర్షవేణి శ్రీనివాస్ సోమవారం బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్ఐకి శాలువా కప్పి సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా వారికి అవగాహన కల్పించి, నేరాల నియంత్రణలో సర్పంచులు తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి హాజీమల్లయ్య, పాలకుర్తి మాజీ సర్పంచ్ దుర్గం జగన్, పెద్దపల్లి నాగరాజు, చెన్నకేశవ స్వామి గుడి చైర్మన్ పికిలింక శ్రీనివాస్, సెక్రటరీ ముల్కనూరు శ్రీధర్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాశన



**మనోహరాబాద్, జనవరి 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో శ్రీ సరస్వతీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున స్వర్ణామృత బిందువులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. 0 నుండి 16 సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారులు అందరూ దీన్ని స్వీకరించవచ్చని పేర్కొన్నారు.స్వర్ణామృతం వలన పిల్లల్లో రోగనిరోధక శక్తి, స్మరణశక్తి, గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మేధాశక్తి అభివృద్ధి చెందుతుందని వారు వివరించారు. శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడే ఈ ఔషధం ఆరు నెలలలోనే పిల్లలను మేధావులుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. హైపర్ ఆక్టివ్, ఆటీజమ్, నత్తి, మెదడు ఎదుగుదల లోపం వంటి సమస్యల్లో కూడా ఇది సమర్థవంతంగా పనిచేస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొని స్వర్ణామృత ప్రాశనను స్వాగతించారు.

# అసెంబ్లీ మీడియా అడ్వైజర్ కమిటీ మెంబర్ బుర్ర ఆంజనేయులు గౌడ్ ను సన్మానించిన నా నేస్తం ట్రస్ట్ సభ్యులు.



**ఎలిగేడు, జనవరి 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అసెంబ్లీ మీడియా అడ్వైజర్ కమిటీ మెంబర్ ను ఎలిగేడు మండల కేంద్రంలోని నా నేస్తం ట్రస్ట్ కు మొట్ట మొదటిసారి వచ్చిన సందర్భంగా ట్రస్ట్ సభ్యులు చిన్ననాటి మిత్రులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మా మిత్రుడు ఎలిగేడు గ్రామ నివాసి ఆయన ఆంజనేయులు గౌడ్ అసెంబ్లీ అడ్వైజర్ కమిటీ మెంబర్ గా నియమింపబడడం గర్వంగా ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం అసెంబ్లీ మీడియా అడ్వైజర్ కమిటీ సభ్యులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ స్నేహానికన్నా మిన్న లోకాన లేదు అన్నట్లుగా తల్లిదండ్రుల తర్వాత మిత్రుల ప్రోత్సాహం ఎంతో గాను ఉందని ఎన్నటికీ పుట్టిన గ్రామాన్ని మిత్రులను మరువనని నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ నిరుపేద ప్రజల కోసం చేస్తున్న సేవలు మరువలేనివని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మనారాయణ, దేవసాని శ్రీనివాస్, వెంగళదాస్ అశోక్, బూర్ల వెంకటేశ్వర్లు, రంగు రాములు, గంప రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల గ్యాస్ పథకం అమలులో గందరగోళం

### అర్హులైన మహిళలకు అన్యాయం జరుగుతోందని బీసీ నేత కొండ లలిత ఆగ్రహం.



**దేవరకొండ జనవరి 04.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ నమస్కారం కేంద్ర ప్రభుత్వం ఉజ్వల గ్యాస్ మహిళలకు మాత్రమే ఉచితంగా గ్యాస్ ఇస్తామన్నారు. ఫస్ట్ సారి ఇదే స్కీమ్ పెట్టినప్పుడు ఎటువంటి సర్టిఫైట్లు అడగలేదు. మహిళలకు ఇచ్చారు. ఇప్పుడు అదే సెంట్రల్ గవర్నమెంట్ మళ్లీ ఉజ్వల గ్యాస్ ఉచితం మహిళలకు అని పెట్టారు. ఆఫీసుకు పోయి రెండు మూడు సార్లు అడిగితే ఫ్రీ గ్యాస్ స్కీము వచ్చింది వాస్తవమే అని ఆఫీస్ వాళ్ళు చెప్పారు. కానీ ఇన్కమ్ లక్ష లోపల ఉండాలి. అని గ్యాస్ ఆఫీస్ సిబ్బంది అంటున్నారు. ఆన్లైన్లో అప్లై చేసుకుంటే ఇన్కమ్ సర్టిఫికేట్ కోసం లక్ష నలభై వేలు ఇన్కమ్ ఇస్తున్నారు. ఎమ్మార్వో కాడికి పోయి ఉజ్వల గ్యాస్ మహిళలకు ఫ్రీ గా ఇస్తున్నారని అడిగితే గ్యాస్ ఆఫీస్ వారు 80000 మరియు 90000 ఉంటేనే ఇస్తా అంటున్నారు. పట్టణాలలో మునిసిపాలిటీ పరిధిలో రెండు లక్షల వరకు ఇన్కమ్ ఉన్న ఇయ్యవచ్చు అని అన్నారు. విలేజ్లలో 1,50,000 ఉన్న ఇయవచ్చు అని అన్నారు. అనగా తేదీ 05-01-2026 సోమవారం రోజున ఆఫీస్ కి వెళ్తే అప్లికేషన్ ఫామ్ ఇయ్యమంటే ఫ్రీ గ్యాస్ లేదు ఎవరు చెప్పారు మీకు ఏ గ్యాస్ లేదు అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. మరొక విషయం ఈ గ్యాస్ మహిళలకు అన్నప్పుడు పెళ్లి అయినా కాకుండా మహిళలకు వర్తిస్తది. పెళ్లయిన వారికి ఇస్తామని అంటున్నారు. ఇదెక్కడి న్యాయం.కొండ లలిత బ్యాక్వర్డ్ క్యాస్ట్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మహిళ విభాగంలో ఇంచార్జ్ తెలంగాణ స్టేట్ వారు డిమాండ్ చేశారు.

# పాఠశాల అభివృద్ధికి నా వంతు సహకారం

## సర్పంచ్ రామచంద్రయ్య.



**దేవరకొండ జనవరి 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
గుండ్లపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక సర్పంచ్ రామచంద్రయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యాబోధన తీరును పరిశీలించారు.విద్యాభివృద్ధికి హామీ: గ్రామంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని, విద్యాభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. విద్యార్థుల అభ్యున్నతి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. వివరాల సేకరణ: పాఠశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలు మరియు ఇతర మౌలిక సదుపాయాల గురించి ఇంచార్జీ హెడ్మాస్టర్ గారిని అడిగి తెలుసుకున్నారు.పాఠశాల సందర్శనకు విచ్చేసిన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ గార్లను పాఠశాల ఇంచార్జీ హెడ్మాస్టర్ భూక్య నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం లింగయ్య, లక్ష్మ, సర్దార్ సింగ్ రాథోడ్, వింజమూరి శ్రీనయ్య, శోభన్ బాబు, వాసవి, పుష్పలత, ఎం. ఏ రవూఫ్, వావిళ్ళ శ్రీనివాస్ ఘనంగా స్వాగతించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# లష్కర్ గూడలో మహిళా భవనానికి స్థల పరిశీలన



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్ మండల లష్కర్ గూడ గ్రామంలో మహిళా సంఘాల కోసం భవనం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్ తన పాలకవర్గంతో కలిసి అంగన్వాడి భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి నూతనంగా వచ్చిన మహిళా సంఘాల బాధ్యతలను అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నరసింహ సమక్షంలో లష్కర్ గూడకు సి.సి. క్లస్టర్ కోఆర్డినేటర్ సుజాత స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కరిమెల రాజు, వార్డు సభ్యులు మధుసూదన్, సుర్వి రజిత, శ్రీకాంత్, గుండె శివప్రసాద్, సిద్ధగోని యాదయ్య, గుండె కవిత, సుధాకర్, గుండె లక్ష్మమ్మ, పెద్ద జంగయ్య, మహమ్మద్ హుస్సేన్, నల్ల దివ్యజ్యోతి, రాజు, మహమ్మద్ నజీరా, అమీద్, గ్రామపంచాయతీ కారోబార్ ఉప్పు రాములు పాల్గొన్నారు.మహిళా సంఘాల వి.వో.లు గుండె బాలమణి, గంట స్వప్న, గంట వినోద, సిద్ధగోని అనూష, పంది వనిత, పంది జ్యోతి, ములుగు నవనీత, వర్ధ వరలక్ష్మి, రుద్రారం చంద్రకళ, ఇరుగు శిరీషతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది కూడా హాజరయ్యారు.

# తిమ్మారెడ్డిపల్లిలో రెడ్డి సంఘం నూతన కమిటీ ఏర్పాటు



**కొండపాక, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం భవన నిర్మాణానికి యెల్లు కుటుంబం తమ పూర్వీకుల స్థలాన్ని మైసమ్మ గుడి దగ్గర అందజేసింది.నూతన కమిటీలో అధ్యక్షుడిగా యెల్లు చంద్రారెడ్డి, సెక్రటరీగా కాశిరెడ్డి మహిపాల్ రెడ్డి, కోశాధికారిగా ఏలూరి కృష్ణా రెడ్డి, గౌరవ సలహాదారులుగా కూరెళ్ల అభిలాష్ రెడ్డి, కాశిరెడ్డి నారాయణరెడ్డి, కాసుల చంద్రారెడ్డి, గౌరిగారి నరసింహరెడ్డి ఎంపికయ్యారు. ఈ నిర్ణయాలతో గ్రామంలో సంఘం ఐక్యత మరింత బలోపేతం అవుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

# ఉమ్మడి మెదక్ జిల్లా సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



**మెదక్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మెదక్ జిల్లా ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా సాఫ్ట్ బాల్ అండర్14, అండర్17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు సోమవారం స్థానిక తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మనోహరాబాద్ మండల విద్యాధికారి వెంకట స్వామి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో మెదక్ జిల్లా జట్టు ప్రతిభను చాటాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, సిద్దిపేట జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తోట సతీష్, వ్యాయామ ఉపాధ్యాయురాలు మంజుల, శ్యామ్ సుందర్ శర్మ, మాలతి, గోవర్ధన్, రాజ్ కుమార్, సతీష్, కోచ్‌లు రవి, రేణుక, సుమన్ తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

# అనారోగ్యానికి గురైన జర్నలిస్టుకు చేయూత



**పెద్దపల్లి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తీవ్ర అనారోగ్యంతో ప్రతిమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు కలవేన రాజేందర్‌కు తోటి జర్నలిస్టులు అండగా నిలిచారు. వైద్య ఖర్చుల కోసం ప్రెస్ క్లబ్ పెద్దపల్లి తరపున రూ.36 వేల రూపాయలు సేకరించి ఆయన సతీమణికి అందజేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉందని, అత్యవసర సమయంలో వైద్యం చేయించుకోవడానికి తోటి సహకారం తప్ప వేరే మార్గం లేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత లభించడం లేదని విమర్శించారు. జర్నలిస్టుల రక్షణ, వైద్యం, ఆర్థిక సహాయం కోసం చట్టాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాజేందర్ వైద్యం కోసం సహకరించిన ప్రెస్ క్లబ్ సభ్యులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు బెజ్జంకి నరేష్, సీనియర్ జర్నలిస్టులు లైశెట్టి రాజు, ఆరెల్లి మల్లేష్, కేతిరెడ్డి ప్రవీన్ రెడ్డి, సాబీర్ పాషా పాల్గొన్నారు.

# ఘనంగా వాకర్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ ప్రమాణ స్వీకారం




**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

అలుగునూర్‌లోని ఉన్నతి ఫంక్షన్ హాల్‌లో వాకర్ ఇంటర్నేషనల్ కరీంనగర్ జిల్లా 304 క్యాబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రవి రాజు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నమనేని సుధాకర్ రావు, గవర్నర్ ఎలెక్ట్ గుడిపాటి రమణారెడ్డి, 40 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ వాకర్ సంఘాలు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని సూచించారు. నడవండి నడిపించండి అనే నినాదంతో ముందుకు సాగాలని, తొమ్మిది జిల్లాలతో కూడిన కరీంనగర్ డిస్ట్రిక్ట్ 304 అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, డైరీ చైర్మన్ రాజేశ్వరరావు, వాకర్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ ప్రభావతి, ఇమిడియెట్ గవర్నర్ కూరాకుల భారతి, క్యాబినెట్ సెక్రటరీ గొట్టుముక్కల రవీందర్, పిఆర్ఓ బుర్ర జగదీశ్వర్, వాకర్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, మహిళా వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కొత్త ఏడాది వేళ అధికారులందరూ జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కేక్ కట్ చేసి నూతన సంవత్సరాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సంఘాల నాయకులు కలెక్టర్, అదనపు కలెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎన్జీవో, టీజీవో సంఘాల క్యాలెండర్లను ఆవిష్కరించారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థలో డివిజన్ల సవరణకు విజ్ఞప్తి



**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరపాలక సంస్థలో నూతనంగా ఏర్పడ్డ డివిజన్ల విభజనలో భౌగోళికంగా అస్తవ్యస్తతలు ఉన్నాయని ప్రజావాణి కార్యక్రమంలో పూలే బిసి సంక్షేమ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ కురుమ విన్నవించారు. ఒకే రోడ్డుకు రెండు డివిజన్లు ఉండడం వల్ల మున్సిపల్ వాటర్ పైప్‌లైన్, స్ట్రీట్ లైట్స్, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు తెలిపారు. పాలనపరంగా కూడా సమస్యలు తలెత్తుతున్నాయని, ఒక రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఓటర్లు ఒకే డివిజన్‌లో ఉండేలా సవరించాలని కోరారు. డివిజన్లను భౌగోళికంగా సవరించితే పరిపాలన సౌకర్యం మెరుగుపడుతుందని, కార్పొరేటర్లు కూడా పనులు సులభంగా నిర్వహించగలరని వారు అభిప్రాయపడ్డారు.

# బైక్ ఢీకొని వ్యక్తి మృతి



**గంగాధర, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గోపాలరావుపల్లి గ్రామానికి చెందిన అమ్ముల విజేందర్ (46) జనవరి 4 సాయంత్రం తన ఇంటి నుండి గంగాధర ఎక్స్‌రోడ్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా, బోయినపల్లి నుండి వచ్చిన బైక్ (టీఎస్ 15దీజీ 2518) అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో విజేందర్ తీవ్ర గాయాలతో కిందపడగా, ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.బైక్ నడిపిన శివరాత్రి నవీన్ కూడా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ వెల్లడించారు.

# పొలం బాట పట్టిన ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్



**పాలకుర్తి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ సతీమణి, మక్కన్ సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ సోమవారం పాలకుర్తి మండలంలో పొలం బాట కార్యక్రమంలో పాల్గొన్నారు.పాలకుర్తి, ఈశాల తక్కళ్లపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి, పుట్నూరు, జయ్యారం, గుడిపల్లి గ్రామాల్లో పొలాల్లో నాట్లు వేస్తున్న మహిళా కూలీలను కలిసి ఆత్మీయంగా పలకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కష్టాలే తమ కష్టాలుగా భావించి సేవ చేస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో భాగంగా గృహజ్యోతి, యువ వికాసం, మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలవుతున్నాయని, రెండు లక్షల వరకు రుణమాఫీ సఫలమైందని తెలిపారు. త్వరలోనే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు రూ.2500 అందజేస్తామని హామీ ఇచ్చారు. సన్నాలకు బోనస్ రాలేదని రైతులు తెలుపగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్ లాంటి పథకాలకు అర్హులైన వారి పేర్లను నమోదు చేసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మంజూరు అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతి, గుడిపల్లి సర్పంచ్ కాసర్ల శ్రీసుధ, పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నవేని నాగేష్, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజు, అన్నం కృష్ణ, అమ్ముల కుమారస్వామి, గంగాధర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తీగలగుట్టపల్లి గ్రామంలోని అపోలో రీచ్ హాస్పిటల్ వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన ఆవుదరి చంద్రశేఖర్ మానేరు వాగు నుండి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. ఇటీవల అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ర్యాకం వెంకటేష్, మల్లెపోగు మధు లను కరీంనగర్ రూరల్ ఎం.ఆర్.ఓ ముందు లక్ష రూపాయల పూచీకతుపై బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు.అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ**




**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని సమన్వయంతో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు వంటి ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు జరపాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా సహాయం అవసరమైన పిల్లలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, కుటుంబాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని సూచించారు. కరీంనగర్ జిల్లాను బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సుగుణ, టాస్క్ ఫోర్స్ ఏసీపీ సతీష్, డీసీపీవో పర్వీన్, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, లేబర్ కమిషనర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, క్వాలిటీ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సీడీపీవోలు, పోలీస్, లేబర్, బాలల రక్షణ అధికారులు పాల్గొన్నారు.

# అంకమెట్టు గుట్టలో క్వారీపై ఫిర్యాదు

**పాలకుర్తి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం జయ్యారం గ్రామ శివారులోని అంకమెట్టు గుట్టకు ఇచ్చిన బ్లాస్టింగ్ క్వారీ అనుమతులను రద్దు చేయాలని గ్రామ సర్పంచ్ కాసర్ల కిరణ్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా సూర్య ఎక్స్‌క్లోజర్స్ అండ్ మెటల్ స్టోన్ క్వారీకి అనుమతులు ఇవ్వడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అంకమెట్టు గుట్టపై స్వయంభువుగా వెలసిన చిన్నయ్య, పెద్దయ్య దేవుడిని చుట్టుపక్కల జిల్లాల నుండి వేలాది మంది భక్తులు దర్శించుకుంటారని, రైతులు పంటలు సాగు చేసే ముందు మొక్కులు చెల్లించి వనభోజనాలు నిర్వహిస్తారని తెలిపారు. క్వారీ బ్లాస్టింగ్ వల్ల గుట్ట ధ్వంసం అవుతోందని, దుమ్ము ధూళి కారణంగా పంట దిగుబడి తగ్గిపోతోందని, బావుల్లో నీరు అడుగంటి పోయి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దైవానికి, ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలుగజేస్తున్న ఈ అనుమతులను రద్దు చేసి అంకమెట్టు గుట్టను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 299 దరఖాస్తులు అందగా, వాటిలో అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 68, హౌసింగ్ శాఖకు 43 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్

**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణి కార్యక్రమంలో కలిసిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్, నగరపాలక సంస్థలో ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని వినతిపత్రం సమర్పించారు. కొత్తపల్లి గ్రామంలో గతంలో ఒక ఎస్టీ కౌన్సిలర్, చింతకుంట గ్రామ పంచాయతీలో రెండు సార్లు ఎస్టీ సర్పంచి ఉన్నారని, ఇప్పుడు ఈ రెండు గ్రామాలు నగరపాలక సంస్థలో కలవడంతో ఎస్టీలకు రాజకీయంగా అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఐదు డివిజన్లు ఎస్టీలకు కేటాయించాలని కోరారు. కలెక్టర్ ఈ విషయాన్ని ప్రత్యేక నోటీసు ద్వారా ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్టీలకు న్యాయం చేయాలంటే ఐదు ఎస్టీ డివిజన్లు పెంచాలని కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు.

# అమెరికా చర్యలకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరసన



**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెనిజుల దేశ అధ్యక్షుడిని నిర్బంధించిన అమెరికా చర్యలను వ్యతిరేకిస్తూ సైదాపూర్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ప్లేకార్డులు పట్టుకొని అమెరికా వైఖరిని ఖండించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ వెనిజుల అధ్యక్షుడు మధురోపై ఆధారం లేని ఆరోపణలు చేసి అక్రమంగా నిర్బంధించారని విమర్శించారు. వెనిజులలో అపారమైన చమురు నిక్షేపాలపై ఆధిపత్యం కోసం అమెరికా ఎన్నో సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తోందని, ఆర్థికరాజకీయ ఆంక్షలను లెక్కచేయకుండా వెనిజుల తన ప్రజల ప్రయోజనాల కోసం నిలబడిందని అన్నారు. హ్యూగో చావేజ్ ధైర్యంగా నిలిచిన వారసత్వాన్ని మధురో కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఉల్లంఘిస్తూ అమెరికా తన మాట వినని దేశాలపై దాడులు చేస్తోందని, ఇది సామ్రాజ్యవాదానికి పరాకాష్ట అని అన్నారు. మధురో దంపతులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, కమిటీ సభ్యులు కదిరే రమేష్, మొలుగూరి రాజయ్య, మండల కన్వీనర్ పల్ల తిరుపతి, కో కన్వీనర్ వీరయ్య, నాయకులు సజ్జన స్వామి, రామ్ మూర్తి, గడిపే దుర్గ ఎల్లయ్య, మాచర్ల సంపత్, గడిపే తిరుపతి, ఓజ్జ మధు, పోచయ్య, కనక చారి తదితరులు పాల్గొన్నారు.

# కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం




**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మహిళా సాధికారతపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సత్యప్రసన్న మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు ఉన్న ప్రతి స్థాయిలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన మహిళా నాయకులకు టికెట్లు ఇవ్వడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా మహిళా కాంగ్రెస్‌లో కష్టపడ్డ మహిళలకు సముచిత స్థానం కల్పించేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గాజుల సుకన్య, నగర అధ్యక్షురాలు వంగల కళ్యాణి రెడ్డి, వెన్నం రజిత రెడ్డి, మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కవ్వ పద్మ, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ హసీనా, జిల్లా మహిళా బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, కార్పొరేషన్ డివిజన్ మహిళా అధ్యక్షులు తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు




**హుస్నాబాద్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం మరియు పంపిణీపై ప్రత్యక్ష అవగాహన కోసం 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరియు 33/11 కేవీ టౌన్ సెక్షన్ ను సందర్శించారు. సబ్‌స్టేషన్ అనేది విద్యుత్ కేంద్రాల నుండి వచ్చే అధిక వోల్టేజ్ విద్యుత్‌ను స్వీకరించి, అవసరమైన స్థాయికి తగ్గించి వినియోగదారులకు పంపే కీలక కేంద్రమని ఇంజనీర్లు వివరించారు. ట్రాన్స్ఫార్మర్లు, సర్క్యూట్ బ్రేకర్లు, ఐసోలేటర్లు, బస్ బార్లు, లో బ్రేకర్లు పని చేసే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపరేటర్లు రాజు, రవీందర్ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా విధానం, భద్రతా చర్యలు, సబ్‌స్టేషన్‌లో పాటించాల్సిన నియమాలు, ప్రమాదాల నివారణ పద్ధతులను వివరించారు. ఈ పర్యటనకు సమన్వయకర్తగా భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు కే. రాజ్యలక్ష్మి వ్యవహరించారు. విద్యార్థులు విద్యుత్ పంపిణీ వ్యవస్థ, పట్టణంలోని వివిధ ప్రాంతాలకు నిరాటంకంగా విద్యుత్ ప్రసారం ఎలా జరుగుతుందో ప్రత్యక్ష అనుభవంతో తెలుసుకున్నారు. విద్యుత్ వినియోగం మరియు పొదుపు గురించి కూడా ఇంజనీర్లు సూచనలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ, పర్యటనల ద్వారా విద్యార్థులు స్వీయ అనుభవంతో విద్యుత్ పంపిణీ, ప్రసార వ్యవస్థపై అవగాహన పొందడం ఎంతో ప్రయోజనకరమని పేర్కొంటూ, భౌతిక శాస్త్ర విభాగ అధిపతి రాజ్యలక్ష్మి మరియు విద్యార్థులను అభినందించారు.

# ప్రభుత్వ భూమి కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**కరీంనగర్ రూరల్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగునూరు గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని మాజీ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఆయన తన రాజకీయ ప్రభావంతో ఒర్రెలో మట్టి నింపి ప్రహరీ నిర్మించి, ఇంటి నిర్మాణం చేసి, తల్లి గంగమ్మ పేరుతో ఇంటి నంబర్ పొందారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజా ఉపయోగాలకు కేటాయించాలని కోరుతూ గ్రామస్తులు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సాయిల్ల రాజు, మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, బండిపెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయమే గెలిచింది

**- లకిడి భాస్కర్**




**పెద్దపల్లి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తనను అన్యాయంగా అధ్యక్ష పదవి నుండి తొలగించడాన్ని తెలంగాణ బార్ కౌన్సిల్ కమిటీ తప్పుపట్టిందని పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ తెలిపారు. సోమవారం కోర్టు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత నెల 2వ తేదీన కొంతమంది సభ్యులు ఏకపక్షంగా సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వకుండా అధ్యక్ష పదవి నుండి తొలగించారని పేర్కొన్నారు. వారి చర్యకు వ్యతిరేకంగా బార్ కౌన్సిల్‌ను సంప్రదించగా, ఇరుపక్షాల వాదనలు విని ప్రతివాదుల నిర్ణయాన్ని కమిటీ తప్పుపట్టిందని తెలిపారు. తనపై చూపిన కారణాలు సహేతుకంగా లేవని బార్ కౌన్సిల్ అభిప్రాయపడిందని, అనేక సంవత్సరాలుగా పెద్దపల్లి బార్ అసోసియేషన్‌లో వివిధ హోదాల్లో పనిచేసి న్యాయవాదులకు అండగా ఉన్నానని గుర్తు చేశారు. తనపై అపవాదులు వేసిన వారికి ఈ తీర్పు చెంపపెట్టులాంటిదని లకిడి భాస్కర్ స్పష్టం చేశారు.

# గాయత్రి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం






**పెద్దపల్లి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లాలోని రంగాపూర్ గ్రామంలో గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) శీతాకాల ప్రత్యేక శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ శిబిరంలో 50 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గంట రమేష్, ఉపసర్పంచ్ కొండ శ్రావణ్, ఐదవ వార్డ్ మెంబర్ ఈర్ల సంతోష్ వెన్నెల, కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, పంచాయితీ సెక్రటరీ గుమ్మడి సదయ్య, జడ్పీ హైస్కూల్ హెచ్.ఎం పీ. శారద, ఇన్‌చార్జి హెచ్.ఎం ఆర్. స్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ గంట రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం అభినందనీయమని, వారికి అన్ని రకాల సహకారం అందిస్తామని తెలిపారు. కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని, చదువుతో పాటు సమాజాన్ని అర్థం చేసుకోవడం ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందాలని సూచించారు.శిబిరం మొదటి రోజులో భాగంగా జడ్పీ హైస్కూల్ ఆవరణలో కలుపు మొక్కలు తొలగించడం, శుభ్రత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఏ. సమద్, అధ్యాపకులు ఎం.డి. ఖాదర్, ఎన్. ఆమని పాల్గొన్నారు.

# టీఎన్జీవోల క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్




**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి, ఐఏఎస్ చేతుల మీదుగా టీఎన్జీవోల క్యాలెండర్2026 ఘనంగా ఆవిష్కరించబడింది. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీవోల నాయకులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు సహా అన్ని వర్గాల ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరింత నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంఘము లక్ష్మణరావు, టిజీఓల అధ్యక్షకార్యదర్శులు మడిపల్లి కాళీ చరణ్, అరవింద్ రెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ హరేమేందర్ సింగ్, హరికృష్ణ, గూడ ప్రభాకర్ రెడ్డి, సందీప్ రవీందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గంగార రమేష్, పోలు కిషన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు అలాగే పట్టణ అధ్యక్షకార్యదర్శులు మారుపాక రాజేష్ భరద్వాజ్, సుమంత్రావు వాస్తవిక గౌడ్, శ్రీమాన్ రెడ్డి, శారద, సబితా, సునీత, సరిత, హరిప్రియ, శైలజ, సుస్మిత, గోవింద పతి శ్రీనివాస్, లవ కుమార్, కమలాకర్, కొండయ్య, అగ్గర్, కడియం శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, గిరిధర్ రావు, ఏవి రాజేశ్వరరావు, వంశీ భీమ్రావు, కర్ణాకర్, రాజ మల్లయ్య, నారాయణ, పాండు, పవన్, లైసెన్స్ సర్వేయర్లు జగన్ తదితరులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కొండగట్టులో గిరి ప్రదక్షిణపై
# పవన్ కళ్యాణ్ దృష్టి

**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యంకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోన్ చేశారు. ఇటీవల కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించిన పవన్ కళ్యాణ్, టీటీడీ నిధులతో హనుమాన్ మాలవిరమణ మండపం, వాయుపుత్ర సదన్ వసతి గృహాలకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కొండగట్టు గిరి ప్రదక్షిణ అంశాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. గిరి ప్రదక్షిణలో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారని, దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సభ వేదికపైనే పవన్ కళ్యాణ్, గిరి ప్రదక్షిణకు సహాయం చేస్తానని, అవసరమైతే కరసేవ కూడా చేస్తానని ప్రకటించారు.కొండగట్టు పర్యటన ముగిసిన 48 గంటల్లోనే పవన్ కళ్యాణ్



మేడిపల్లి సత్యంకు ఫోన్ చేసి, గిరి ప్రదక్షిణ నివేదిక పంపాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో మేడిపల్లి సత్యం, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ను సంప్రదించి, గిరి ప్రదక్షిణ ప్రాంతంపై ఫీల్డ్ సర్వే చేయాలని కోరారు. వెంటనే కలెక్టర్ రెవెన్యూ, ఫారెస్ట్, ఎండోమెంట్ అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ప్రాంతాన్ని పరిశీలించారు.త్వరలో పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి పవన్ కళ్యాణ్‌కు అందజేయనున్నారు. నివేదికలో గిరి ప్రదక్షిణ రహదారి, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, వాష్‌రూమ్స్, హనుమాన్ భక్తి పాటలతో మ్యూజిక్ సిస్టం ఏర్పాటు వంటి అంశాలు ఉండనున్నాయి.కొండగట్టు క్షేత్రం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకునేలా నివేదిక రూపొందించబడుతుందని, పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలో నివేదిక అందజేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.

# పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన సదస్సు



**పెద్దపల్లి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రంగంపల్లి మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్‌లో అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రతా చర్యలు, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్, ట్రిపుల్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని వివరించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ చిన్న వయసు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుని, వాటిని కుటుంబ సభ్యులకు తెలియజేసి రోడ్డు భద్రతకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు దూరం ప్రతి ప్రయాణం సురక్షితం అని ఆయన స్పష్టం చేశారు. సురక్షిత డ్రైవింగ్ అలవాట్లతోనే ప్రతి ఒక్కరూ తమ గమ్యానికి సురక్షితంగా చేరుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అనిల్, ఎస్ఐ రవీందర్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగంపై నగునూరు గ్రామస్తుల ఫిర్యాదు

**కరీంనగర్ రూరల్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగునూరు గ్రామ అభివృద్ధి కోసం మంజూరైన ఎంజీ.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులలో రూ.50 లక్షలు ప్రజల సౌకర్యార్థం వినియోగించకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.గ్రామంలో వేయవలసిన సి.సి. రోడ్డు, డ్రైనేజి పనులను మాజీ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ తన స్వంత ఫామ్ హౌజ్, వ్యవసాయ భూముల కోసం మళ్లించారని గ్రామస్తులు ఆరోపించారు.ఈ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులు మరియు కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిల్ల రాజు, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, బండివెల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

# ఓటర్ల గల్లంతుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**కరీంనగర్ రూరల్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేకుర్తి 18, 19 డివిజన్లతో పాటు మిగతా 60 డివిజన్లలో ఓటర్ల పేర్లు ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్‌కు జంప్ అవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రతినిధి దుర్గం మారుతి, న్యాయవాది, రేకుర్తి ప్రజలతో కలిసి కలెక్టర్‌ను కలసి ఓటర్ల జాబితా సవరణ చేయాలని కోరారు. రేకుర్తి ప్రభుత్వ భూములను కబ్జా చేసి తప్పుడు ఇంటి నంబర్లతో ఓటర్లుగా నమోదు చేసుకున్న వారి పేర్లను తొలగించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా సవరణ జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రజలు హెచ్చరించారు. రేకుర్తి 18, 19 డివిజన్లలో నివసించే వయోజనులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పేర్లు సరిచేయాలని, ప్రతి డివిజన్‌లోని ఓటర్లు తమ డివిజన్‌లోనే నమోదు కావాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిట్టల సత్యనారాయణ, హస్తపురం అంజయ్య, గోదారి చంద్రయ్య, జి. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సరిచేయాలి



**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వినతిలో, నూతనంగా ఏర్పడిన 66 డివిజన్లలో ఒక డివిజన్ నుండి మరొక డివిజన్‌కు మారిన ఓటర్లను సరిచేయాలని, కొన్ని డివిజన్లలో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసిన కొత్త ఓటర్లకు నమోదు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ఒకే రోడ్డుకు చెందిన ఓటర్లు ఒకే డివిజన్ పరిధిలో ఉండేలా సవరించాలని, పోలింగ్ బూత్ సెంటర్లు ఆయా డివిజన్ పరిధిలోనే ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ వినతిపత్రాన్ని కాంగ్రెస్ నాయకులు డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహన్, వీర దేవేందర్, మొహమ్మద్ అమీర్, శేఖర్, ఇమ్రాన్ ఆసిఫ్ మరియు పలువురు మాజీ కార్పొరేటర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

# దేవాలయ అభివృద్ధికై హిందూ సంఘాల డిమాండ్

**హుస్నాబాద్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలోని ప్రసిద్ధ శ్రీ స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ హిందూవాహిని, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయం ముందు నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హిందూ సంఘ నాయకుడు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పోట్లపల్లి దేవస్థానాన్ని వేములవాడ పుణ్యక్షేత్రం స్థాయిలో అభివృద్ధి చేస్తానని బాండ్ పేపర్‌పై హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ హామీ నెరవేరలేదని విమర్శించారు. మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆలయంలో టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం, విశ్రాంతి భవనాలు, షెడ్స్, ముఖద్వార నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కవ్వ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఇతర మతాల



పండుగలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, కానీ హిందూ ఆలయాల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మహాశివరాత్రి వరకు ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. హిందూ వాహిని జిల్లా సహ సంయోజకుడు పూదరి వెంకటేష్ మాట్లాడుతూ, గతంలో ఆలయం అభివృద్ధి నోచుకోలేదని, ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు పెందోట అనిల్, గోళ్లపెల్లి వీరాచారి, గాదాసు రాంప్రసాద్, వరియోగుల అనంతస్వామి, పోలోజు రాజేందర్ చారీ, వడ్డెపల్లి లక్ష్మయ్య, అశాడపు శ్రీనివాస్, బొప్పిశెట్టి సాయిరామ్, అబ్బిడి లింగారెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయంపై ధూంధాం కళాకారుల హర్షం





**హుస్నాబాద్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారధి ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు ఆమోదించడంతో ధూంధాం కళాకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన జీవోను అసెంబ్లీ ఆమోదించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, చైర్మన్ వెన్నెల గద్దర్ అక్క, అన్ని పార్టీల శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులకు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ధూంధాం కళాకారుడు పొన్నాల అశోక్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పని చేసిన మాకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది. 12 సంవత్సరాలుగా ఉపాధి కోసం పోరాడుతున్న మాకు రేవంత్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలు కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి మా జీవితాల్లో వెలుగులు నింపబోతున్న ప్రజా ప్రభుత్వానికి జన్మంతా రుణపడి ఉంటాం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తెలంగాణ ఉద్యమ కళాకారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిందని కళాకారులు పేర్కొన్నారు.

# అర్జీలను సత్వరమే పరీక్షించాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి కలెక్టర్ ప్రజల సమస్యలను విన్నారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, నర్సాపూర్ గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి భూమి వివాదాన్ని పరిష్కరించాలని, గుంజపడుగు గ్రామానికి చెందిన శంకరమ్మకు ఇల్లు కాలిపోయిన నేపథ్యంలో సహాయం అందించాలని, అడ్డగుంటపల్లి గ్రామానికి చెందిన సమ్మయ్యకు వృద్ధుల సంరక్షణ చట్టం ప్రకారం రక్షణ కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొండగట్టు అభివృద్ధిని ఓర్వలేకనే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై రవిశంకర్ విమర్శలు

**కరీంనగర్, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత సుంకే రవి శంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. డిసిసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొండగట్టు అభివృద్ధి విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యంపై రవిశంకర్ చేసిన ఆరోపణలు అసత్యమని పేర్కొన్నారు. ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 35 కోట్ల నిధులు కేటాయించగా, దాని వెనుక మేడిపల్లి సత్యం కృషి ఉందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే 80 కోట్ల రూపాయలు తెచ్చి అభివృద్ధి




పనులు ప్రారంభించారని, బిఆర్ఎస్ హయాంలో మాత్రం శిలాఫలకాలకే పరిమితమైపోయాయని విమర్శించారు. కొండగట్టు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవల అసెంబ్లీలో 350 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని గుర్తుచేశారు. రవిశంకర్ తన సొంత గ్రామంలో కూడా అభివృద్ధి చేయలేకపోయారని, ప్రజలు ఆయనను మరిచిపోయారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కొండగట్టు అభివృద్ధి జరుగుతుందని, భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, రవిశంకర్ చేసిన ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆంజనేయులు గౌడ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తాడిచెర్ల సర్పంచ్ రామిడి రాజిరెడ్డి, పురం రాజేశం, రామిడి తిరుపతిరెడ్డి, సర్దార్ దన్నా సింగ్, వంగల విద్యాసాగర్, కోల రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద విద్యార్థులకు జాతీయ స్థాయి రంగోత్సవ్ అవార్డులు





**గంగాధర, జనవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల కేంద్రంలో ఉన్న వివేకానంద విద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయి రంగోత్సవ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్నారు. ఈ పోటీల్లో మొదటి, నాలుగవ బహుమతులతో పాటు 136 మంది విద్యార్థులు బంగారు, వెండి, కాస్యం పతకాలు సాధించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు అవార్డులు బహుకరించారు. ముఖ్య అతిథులుగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్రవంతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హరిత పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక వైభవాన్ని చాటేందుకు, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రతి సంవత్సరం రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి-రాజన్న, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డ్ సభ్యులు నగేష్, పాఠశాల డైరెక్టర్ ఆనంత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉషా రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజకీయం అంటే సామాజిక బాధ్యత

## క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నేనావత్ అభిలాష్ నాయక్

**దేవరకొండ 05 జనవరి. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామీణ యువతను క్రీడల ద్వారా సమర్థవంతమైన నాయకత్వానికి తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో దేవరకొండ నియోజకవర్గంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువత శారీరకంగా, మానసికంగా బలపడితేనే సమాజ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందనే దృక్పథంతో ఈ టోర్నమెంట్‌ను రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీలలో దేవరకొండ పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ మైదానం (డిండి రోడ్) లో నిర్వహించనున్న ఈ పోటీలకు "నేనావత్ అభిలాష్ నాయక్ ఛాలెంజర్ ట్రోఫీ" అనే పేరును నిర్ణయించారు. ఈ టోర్నమెంట్‌లో దేవరకొండ నియోజకవర్గానికి చెందిన 8 మండలాల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి కబడ్డీ జట్లు



పాల్గొననున్నాయి. యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమను పెంపొందించడంలో కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందని యువ నాయకుడు నేనావత్ అభిలాష్ నాయక్ అభిప్రాయపడ్డారు. గ్రామ స్థాయిలోనే క్రీడాకారులను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపగల క్రీడాకారులు ఎదుగుతారని ఆయన పేర్కొన్నారు. యువతను వ్యసనాలు, తప్పుదారి నుంచి దూరం చేసి క్రీడల వైపు మళ్లించడమే తన లక్ష్యమని, ప్రతి గ్రామంలో క్రీడా సంస్కృతి బలపడాలన్నదే తన విజన్ అని అభిలాష్ నాయక్ గారు తెలిపారు. రాజకీయంతో పాటు సామాజిక బాధ్యతగా క్రీడా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పూర్తి మద్దతు తెలియజేస్తూ స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ యువ నాయకత్వం క్రీడా రంగంలో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నట్లు తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్లు గ్రామీణ యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే అందరు క్రీడాకారులకు ప్రత్యేక డ్రెస్‌లు, అలాగే విజేత జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయాన్ని టోర్నమెంట్ నిర్వాహకులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్, చంద్రయ్య గారు మీడియాకు తెలియజేస్తూ, నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని క్రీడా రంగంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# అన్నారం లో గ్రామ సభ

**/మహాదేవపూర్, జనవరి 5**
మహాదేవపూర్ మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ నీర్ల ప్రభాకర్ అధ్యక్షతన మొదటి గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు గ్రామపంచాయతీ సంబంధించిన వివిధ శాఖలు ( రెవెన్యూ, పంచాయతీరాజ్ ,విద్యా, ఆరోగ్యం, ఐసిడిఎస్, ఎస్ హెచ్ జి ఉపాధి హామీ పథకం) అధికారులు హాజరు కావడం జరిగింది. సభలో గ్రామపంచాయతీకి సంబంధించిన వివరములు వివిధ శాఖల అధికారులు ప్రజలకు తెలియపరచడం జరిగింది. సర్పంచ్ వివిధ అంశముల పైన మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను మా



పాలకవర్గం ముందుకు తీసినట్లైతే కాలక్రమేనా పరిష్కరిస్తామని ప్రజలందరికీ తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డసభ్యులు, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి ,గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ గ్రామసభను విజయవంతం చేయడం జరిగింది.

## కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆరోగ్య కార్యక్రమాలు అభినందనీయం



**మహబూబాబాద్, జనవరి 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాళోజి వాకర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను మహబూబాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శబరీష్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పి శబరీష్ మాట్లాడుతూ, కాళోజి వాకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, ఆరోగ్యపరమైన చర్యలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అభినందించారు. సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో అసోసియేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మోహన్, వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ, గౌరవ సలహాదారు మైస నాగయ్య, అధ్యక్షులు నామిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, పెద్ది వెంకన్న, వాసవి పెయింట్స్ కిషోర్ కుమార్, మధుసూదన్ రెడ్డి, గోనే శ్యామ్, నేతుల వెంకన్న, జిలకర శ్రీహరి, గండి వీరేందర్ గౌడ్, కందగట్ల వెంకన్న, మేకల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ హెచ్చరిక



**ఆమనగల్లు, జనవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమనగల్లు మున్సిపాలిటీలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చేతులు తప్పవని ఆమనగల్లు కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీలోని 12వ వార్డు శాంతినగర్ కాలనీలో అనుమతులు లేకుండా చేపట్టిన పనులను నిలిపివేసినట్లు తెలిపారు. వార్డులో సీసీ రోడ్లు అండర్ డ్రైనేజీ నిర్మాణానికి టీయూ ఎఫ్ఐడీసీ ద్వారా రూ. 15 లక్షలు, అమృత్ పథకం కింద వాటర్ పైప్ లైన్ మంజూరు అయినట్లు తెలిపారు.

## సైబరాబాద్ సీపీ ని కలిసినటిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**హైదరాబాద్, జనవరి 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సైబరాబాద్ సీపీ డా. రమేష్ రెడ్డి ని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సైబరాబాద్ పోలీస్ కమీషనర్ డా. రమేష్ రెడ్డి ని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సీపీ కి శుభాకాంక్షలు తెలిపారు.

# బంగ్లాదేశ్ లో మరో ఘటన
# హిందూ మహిళపై అత్యాచారం



**న్యూఢిల్లీ – 05 జనవరి. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బంగ్లాదేశ్ లో హిందువులపై వరుసగా దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో దారుణ ఘటన వెలుగుచూసింది. హిందూ వితంతు మహిళ (40)పై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. అంతేకాదు.. ఆమెను చెట్టుకు కట్టేసి, జుట్టు కత్తిరించారు. ఈ ఘటన సెంట్రల్ బంగ్లాదేశ్ లోని, జెనైద్ జిల్లా, కాళిగంజ్ ప్రాంతంలో జరిగింది. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు కొంతకాలం క్రితం షహీన్ అనే వ్యక్తి నుంచి అక్కడ కొంత స్థలంతోపాటు, రెండంతస్తుల ఇంటిని కొనుగోలు చేసింది. అప్పటినుంచి షహీన్ ఆమెను పలురకాలుగా వేధించాడు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కోపం తెచ్చుకున్న షహీన్, హసన్ అనే వ్యక్తితో కలిసి వచ్చి మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారు. అలాగే ఆమెను చెట్టుకు కట్టేసి, జుట్టు కత్తిరించారు. ఈ ఘటనను వారు వీడియో తీసి, సోషల్ మీడియాలో షేర్ చేశారు. అంతేకాదు.. బాధితురాలి నుంచి డబ్బు కూడా డిమాండ్ చేశారు. డబ్బు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆమె బంధువులపై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో బాధిత మహిళపై మరింతగా దాడి చేయడంతో ఆమె స్పృహ కోల్పోయింది. స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులకు ఆమె అత్యాచారం గురించి చెప్పలేదు. కానీ, వైద్యం అందిస్తున్న సమయంలో ఆమె అత్యాచారానికి గురైనట్లు గుర్తించారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్ లో హిందువులు, మైనారిటీలపై దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. గత నెలలో దీపు చంద్రదాస్ ను దాడి చేసి చంపేయగా, మరో హిందూ ఖోకోన్ చంద్ర దాస్ పై దాడి చేయగా అతడు కూడా మరణించారు. మరికొందరిపై కూడా ఇలాగే దాడులు జరిగాయి.

## ఇరాన్ లో హింసాత్మక నిరసనలు

### అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ హెచ్చరిక



**న్యూఢిల్లీ – 05 జనవరి. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇరాన్ లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకుంటున్నందున భారత పౌరులు ఆ దేశానికి ప్రయాణాలు మానుకోవాలని కేంద్ర విదేశాంగ శాఖ సోమవారంనాడు అడ్వయిజరీ జారీ చేసింది. ఇరాన్‌లోని భారత పౌరులు తగిన జాగ్రతలు తీసుకోవాలని, నిరసన ప్రదర్శనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక అధికారులు, వార్తా సంస్థల అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు ఫాలో కావాలని సూచించింది. అలాగే టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా ఛానెల్స్ నుంచి సమాచారం చెక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రెసిడెంట్ వీసాపై ఇరాన్‌లో ఉంటున్న భారత పౌరులు ఇప్పటికే భారత రాయబార కార్యాలయంలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలని కూడా ఎంఈఏ సూచించింది. ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం తలెత్తడంతో ప్రజల్లో నిరసన అంతకంతకూ తీవ్రమవుతోంది. పెద్ద సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవల ఆందోళనకారులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు.


## అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ నివాసంపై దాడి



**వాషింగ్టన్, 05 జనవరి. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై దాడి జరిగింది. ఒహాయోలోని ఆయన నివాసంపై సోమవారంనాడు ఈ దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దాడి జరిగిన సమయంలో జేడీ వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దాడిలో ఆయన ఇంటి అద్దాలు పగిలాయి. వాన్స్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి చేశారా, వేరే కారణం ఏదైనా ఉందా అనే దానిపై విచారణ జరుగుతోంది. ఈ ఘటనపై ఉపాధ్యక్షుడు కానీ, వైట్ హౌస్ కానీ వెంటనే స్పందించలేదు.


## ప్రపంచంలోనే అత్యంత భారీ శివలింగం..

### మధ్యలోనే నిలిచిపోయిన ప్రయాణం



**న్యూఢిల్లీ – 05 జనవరి. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచంలోనే అతిపెద్దదైన, అత్యంత బరువైన శివలింగం ప్రయాణం మధ్యలోనే నిలిచిపోయింది. తమిళనాడు లోని మహాబలిపురం లో తయారైన శివలింగం అదివారం ఉదయం బీహార్‌లోని గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. గోపాల్‌గంజ్‌లో గండక్ నది (నారాయణి నది) పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ భారీ శివలింగాన్ని తరలించడం అక్కడి అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ భారీ శివలింగం బరువు సుమారు 210 టన్నులు కాగా.. దీనిని తరలిస్తున్న 106 చక్రాల ప్రత్యేక ట్రైలర్ (లారీ) బరువు మరో 160 టన్నులు. ఈ రెండింటి మొత్తం బరువును ఆ వంతెన మోయలేదని నిపుణులు చెబుతున్నారు. వంతెనపై చాలాచోట్ల పగుళ్లు ఉన్నట్లు ప్రాథమిక తనిఖీల్లో గుర్తించడంతో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, బీహార్ రాజ్యపుల్ నిర్మాణ్ నిగమ్ లిమిటెడ్ బృందాలను పిలిపించినట్లు జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ సిన్హా తెలిపారు. బీహార్ మంత్రి అశోక్ చౌదరి కూడా గోపాల్‌గంజ్‌కు వచ్చి వంతెనను స్వయంగా పరిశీలించనున్నారు. వారి పరిశీలన అనంతరం శివలింగం తరలింపుపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ మహా శివలింగాన్ని తూర్పు చంపారన్ జిల్లా కేంద్రమైన మోతిహారిలోని విరాట్ రామాయణ్ ఆలయానికి తరలించాల్సి ఉంది. ఈ భారీ వాహనం మహాబలిపురం నుంచి 3,178 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 32 రోజుల్లో ఈ వాహనం గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. శివలింగం తూర్పు చంపారన్ చేరుకోవడానికి మరో రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, వాటి పరిస్థితి సంతృప్తికరంగా లేదని అధికారులు చెబుతున్నారు. ఒక మార్గంలోని వంతెన సామర్థ్యం సరిపోదని, మరో మార్గంలో కూడా అనేక చిన్న వంతెనలు, కల్వర్టులు ఉండటంతో భారీ వాహనం ప్రయాణించడం కష్టమని భావిస్తున్నారు. దాంతో శివలింగాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చేందుకు అధికారులు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు.

## ట్రంప్ టారిఫ్‌లపై విమర్శించిన జైరాం రమేశ్



**న్యూఢిల్లీ – 05 జనవరి. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. భారత్‌పై మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ కేంద్రాన్ని విమర్శించారు. భారత్ దిగుమతులపై అధిక సుంకాల్ని విధిస్తామని ట్రంప్ మరోసారి బెదిరించారని అన్నారు. 'నమస్తే ట్రంప్, హౌడీ మోడీ కార్యక్రమాలు, వ్యక్తిగత ఆప్యాయతను పదేపదే ప్రదర్శించడం (హగ్ చేసుకోవడం), సోషల్‌మీడియా ప్రశంసలు వల్ల భారతదేశానికి కొంచమే మంచి చేశాయి. వైట్ హౌస్‌లో ప్రధాన మంత్రికి మంచి స్నేహితుడు భారతదేశం పట్ల తన హాట్ హాట్ విధానాన్ని కొనసాగిస్తున్నారు' అని రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.





# ఇంప్రెసివ్‌గా లెనిన్ ఫస్ట్ సింగిల్..
# అఖిల్, భాగ్యశ్రీ బోర్సే వారెవా వారెవా సాంగ్

ఇండస్ట్రీలో హీరోగా నిలదొక్కునేందుకు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్. సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్ లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్ఘగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్నఈ మూవీ మే 1న గ్రాండ్‌గా విడుదల కానుంది.మేకర్స్ తాజాగా వారెవా వారెవా సాంగ్ విడుదల చేశారు. ఇన్నావా ఇన్నావా కన్నెపిల్ల ఏమందో ఇన్నావా.. వారెవా వారెవా భాగ్య శ్రీ బోర్సే, అఖిల్ అండ్ టీంపై వచ్చే ఈ పాట కొంచెం క్లాస్, కొంచెం మాస్ టచ్ ఇస్తూ సాగుతుంది. జుబిన్ నాటియాల్, శ్వేత మోహన్ పాడిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేయడం పక్కా అని విజువల్స్ చెబుతున్నాయి. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న లెనిన్ కోసం కంప్లీట్ మేకోవర్ మార్చేశాడు అఖిల్.ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.



## ఆరెంజ్ డ్రెస్ లో బ్యాచిలర్ బ్యూటీ అందాల విందు




# సంక్రాంతికి 'పెద్ది' రెండో పాట?

రామ్‌చరణ్ కథనాయకుడిగా నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. తొలిపాట 'చికిరి చికిరి' సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌గా మారి సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. మార్చి 27న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటికొచ్చింది. సంక్రాంతి కానుకగా రెండో పాటను విడుదల చేయబోతున్నారని తెలిసింది. 'చికిరి చికిరి' సూపర్‌హిట్ కావడంతో..రెండో పాట మీద మరింతగా అంచనాలు పెరిగాయి. ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్న ఈ సినిమాలోని పాటలు సరికొత్త ట్రెండ్ సృష్టిస్తాయని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. ఇదిలావుండగా 'పెద్ది' సినిమా అనుకున్న సమయానికి రాకపోవచ్చని, షూటింగ్ ఆలస్యం కారణంగా డిసెంబర్‌కి వాయిదా పడే అవకాశాలున్నాయని సోషల్‌మీడియాలో ప్రచారం మొదలైంది. అయితే ఈ పుకార్లలో వాస్తవం లేదని అంటున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం ఎట్టిపరిస్థితుల్లో సినిమాను వేసవికే విడుదల చేయాలనే సంకల్పంతో ఉందట. జాన్వీకపూర్, శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, నిర్మాణం: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.



# చీరలో అందాల సెగలు..

## యూత్ గుండెల్లో మంట పెడుతున్న ఉప్పెన బ్యూటీ!

కన్నడ బ్యూటీ కృతి శెట్టి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు బుచ్చి బాబు సనా దర్శకత్వంలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ సరసన ఉప్పెన సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకుని, స్టార్ హీరోయిన్ రేంజ్‌లో మంచి ఫేమ్ సంపాదించుకుంది.ఉప్పెన మూవీలో బేబమ్మ గా నటించి, ఆ పాత్రలో తన అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకొని, కుర్రకారు ఫేవరెట్ అయిపోయింది. దీంతో ఈ బ్యూటీ టాలీవుడ్‌లో చాలా తక్కువ సమయంలోనే సీనియర్ హీరోయిన్‌గా తన సత్తా చాటుతుందని అందరూ అనుకున్నారు కానీ, ఈ అమ్మడుకు మాత్రం అదృష్టం కలిసి రాలేదనే చెప్పాలి.ఈ మూవీ తర్వాత ఈ చిన్నది టాలీవుడ్‌లో చాలా అవకాశాలు అందుకుంది. దాదాపు వరసగా రెండు మూడు సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడిపేసింది. కానీ లక్కు మాత్రం కలిసిరాలేదు. చేసిన సినిమాలు దాదాపు అన్నీ కూడా ఫ్లాప్ అయ్యాయి. దీంతో టాలీవుడ్ ఐరన్ లెగ్‌గా మారిపోయింది ఈ అందాల చిన్నది.దీంతో మెల్లిగా తెలుగులో అవకాశాలు తగ్గడం మొదలు అవ్వడంతో ఈ బ్యూటీ కోలీవుడ్, బాలీవుడ్, మాలీవుడ్ పై కన్నేసి, అక్కడికి షిఫ్ట్ అయిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు ఇతర భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టి?వ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా, చీరలో తన అందాలతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# పొట్టేలు పోటీల నేపథ్యంలో 'జాకీ'



తమిళనాడు మధురై గ్రామీణ నేపథ్యంలో పొట్టేళ్ల పోరాటం చుట్టూ నడిచే కథతో రూపొందించిన చిత్రం 'జాకీ'. డా? ప్రగభల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ప్రేమకృష్ణదాస్, సి.దేవదాస్, జయ దేవదాస్ నిర్మాతలు. ఆదివారం చెన్నైలో టీజర్‌ను విడుదల చేశారు.మధురై పరిసర ప్రాంతాల్లోని సంప్రదాయ పొట్టేలు పోటీల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ప్రతీ సన్నివేశం ఎంతో సహజంగా ఉంటుందని, సంప్రదాయ క్రీడను నేటి తరానికి చూపిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నారు. యువన్‌కృష్ణ, రిదాన్ కృష్ణాస్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి శక్తి సంగీతాన్నందించారు.